# నేత్రానందం.. ఉద్దాలోత్సవం

- గోవిందనామంతో మార్మోగిన కాంచనగుహ
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు
- పూజలు చేసిన ఎమ్మెల్యే ఆల, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ
- భక్తులతో కిటకిటలాడిన తేరుమైదానం
- బారులు తీరిన భక్తులు.. గట్టి బందోబస్తు



కురుమూర్తి స్వామి ఉద్దాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మూసాపేట/దేవరకద్ర రూరల్, నవంబర్ 19: కురుమూర్తి గిరులు ఆదివారం గోవిందనామంతో మారుమోగాయి. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఉద్దాల ఊరేగింపు నేత్రానందంగా సాగింది. ఆదివారం ఉదయం పల్లమర్రిలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చాటకు ప్రత్యేక పూజలు చేశారు. అక్కడినుంచి భక్తుల సందడితో మేళతాళాల మధ్య చాటను ఊరేగింపుగా చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల మండపం వరకు తీసుకొచ్చారు. అక్కడ ఆచారం ప్రకారం స్థానిక దళితలతోపాటు కలిసి ఎమ్మెల్యే ఆల, వివిధ పార్టీల నాయకులు పూజలు చేశారు. అక్కడి నుంచి ఉద్దాల ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. ఈ వేడుకను చూడడానికి వివిధ జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు అత్యంత నిష్టలతో వంటలు వండి స్వామి వారికి దాసంగాలు చేసి నైవేద్యం సమర్పించారు.

### చిన్నవడ్డెమాన్ నుంచి..

చిన్నచింతకుంట మండలంలోని చిన్నవడ్డెమాన్‌లోని ఉద్దాల ఆలయంలో ఉద్దాలకు దేవరకద్ర ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి, నెల్లి వంశస్తులైన మనోహర్ రెడ్డితో కలిసి మొదటి పూజలు చేశారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల పెద్దలు ఉద్దాలకు ప్రత్యేక పూజులు చేశారు. అక్కడే భక్తుల దర్శనం కోసం ఉద్దాలను కొంత సమయం ఉంచి అక్కడి నుంచి వాగులో నుంచి తరలిస్తుండగా భక్తులు చాటకింద దూరి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి ట్రాక్టర్‌పై పెద్దవడ్డెమాన్, తిర్మలాపూర్ గ్రామాల మీదుగా కురుమూర్తి స్వామి ఆలయ సమీపంలోని మండపం వద్దకు చేరుకున్న తర్వాత అక్కడ ఎమ్మెల్యే ఆల, జెడ్పీచైర్‌పర్సన్ భక్తులతోపాటు కలిసి పూజలు చేశారు. అదేవిధంగా అక్కడి నుంచి స్వామివారి ఆలయం వద్దకు ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకొచ్చి ఉద్దాల మైదానంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఉద్దాల మండపం వద్దకు ఉద్దాలను తీసుకెళ్లి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పూజలు నిర్వహించారు. అక్కడికి తరలివచ్చిన భక్తులను ఎమ్మెల్యే ఆల పలకరిస్తూ సందడి చేశారు. ఉద్దాల ఊరేగింపులో మంగళవాయిధ్యాలు, భక్తుల భజనలు, కేరళ వాయిద్యం, సిగసత్తుల పూనకాలతో అంగరంగవైభవంగా స్వామి వారి ఉద్దాల ఊరేగింపు ముగింసింది. అనంతరం భక్తుల దర్శించుకున్నారు.

### లక్షలాదిగా తరలొచ్చిన భక్తులు..

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉద్దాలు ఊరేగింపునకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దాదాపు 2లక్షలకు పైగానే తరలివచ్చినట్లు పరిశీలకులు తెలిపారు. వివిధ సందర్భాల్లో తొక్కిసలాట జరిగే ప్రమాదం వచ్చింది. ఆ సమయంలో పోలీసులు నిరోధించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 7గంటల నుంచి స్వామివారి దర్శనానికి బారులు తీరారు. కురుమూర్తి రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ నుంచి గుట్టపై ఉన్న కాంచనగుహలోని స్వామివారి దర్శనం వరకు భారీగా క్యూలైన్ కట్టారు.

### ఇసుకేస్తే రాలని జనం

పాలమూరుతోపాటు వివిధ జిల్లాలకు చెందిన ఎన్నో వేల కుటుంబాలకు కురుమూర్తి స్వామి ఇంటి దేవుడుకావడంతో బ్రహ్మోత్సవాల్లో ఉద్దాల రోజు స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీ. అందుకే భక్తులు ఎవరి స్థాయిని బట్టి వారు బైక్‌లు, ఆటోలు, కార్లు, జీపులు, ఎద్దుల బండ్లు, బస్సులు, గూడ్స్ వాహనాలు, ఇలా చెప్పుకుంటూ పోతే ఎవరికి అందుబాటులో ఉన్న వాహనాలతో నలుమూలల నుంచి వచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పెద్దసంఖ్యలో భక్తులు కురుమూర్తి స్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. దీంతో స్వామివారి ఆలయ పరిసరాలు భక్తులు, వాహనాలతో నిండిపోయింది.



కురుమూర్తి స్వామి ఉద్దాలకు మొక్కుతున్న భక్తులు



కురుమూర్తి స్వామి ముఖద్వారం వద్ద కిక్కిరిసిన భక్తులు



ఉద్దాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆల

### నిరంతరం పర్యవేక్షణ

ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిరంతరం పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో ఏర్పా ట్లు చేశారు. ఈవో మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరీరాము, పాలక మండలి సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా జాతరలో ప్రత్యేకించి వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. తాగునీటి సమస్య రాకుండా చూశారు. ఎప్పటికప్పుడు పారిశుధ్యం పనులు చేపడుతున్నారు. పుష్కరిణిలో భక్తుల స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.



కురుమూర్తి స్వామికి దాసంగాలను సమర్పిస్తున్న భక్తులు

# కాంగ్రెస్ వస్తే వ్యవసాయం కుదేలు

- మేం మోసపోయినం.. మీరూ మోసపోకండి
- అన్నకే సీఆర్‌మ ళ్లీ రావాలంటూ కర్ణాటక రైతుల ర్యాలీ
- అడుగడుగునా నీరాజనంపలికిన తె లంగాణ వాసులు
- రాయిచూర్, శక్తినగర్ నుంచి పాదయాత్ర



కర్ణాటక రైతులకు ఘనస్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఊట్కూర్/ కృష్ణ/మాగనూర్/ మక్తల్ టౌన్/ నారాయణపేట రూరల్, నవంబర్ 19: కర్ణాటకలో రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేసింది. ఇక్కడ (తెలంగాణ)లో కూడా మోసం చేస్తుంది. కాంగ్రెస్ గ్యారెంటీలను నమ్మి మేం మోస పోయినం.. కాంగ్రెస్‌కు ఓటేసి మీరు మోసపోకండి అంటూ కర్ణాటకలోని దేవసూగూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు రైతులు తెలంగాణ ప్రజానికానికి విజ్ఞప్తి చేశారు. కర్ణాటకకు చెందిన 'పరిసర ప్రేమ' రైతు సంఘానికి చెందిన దాదాపు 500మంది రైతులు ట్రాక్టర్లు, 200 బైక్‌లు, 50కార్లపై ఉదయం 11 గంటలకు కృష్ణ మండలం వాసునగర్ బార్డర్ చెక్‌పోస్టు దాటుకుని తెలంగాణలోకి ప్రవేశించారు. మరో పదిరోజుల్లో తెలంగాణలో జరుగుతున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి రాష్ట్రానికి తిరిగి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలంటూ ప్రజలను చైతన్యం చేశారు. మెడలో గులాబీ కండువా ధరించి వాహనాలకు కేసీఆర్ బొమ్మ ఉన్న జెండాను కట్టుకుని తెలంగాణలోకి ప్రవేశించిన కర్ణాటక రైతులు మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ, మాగనూర్, మక్తల్, ఊట్కూర్ మండలాల మీదుగా నారాయణపేట జిల్లాకేంద్రానికి చేరుకున్నారు. మార్గమధ్యంలో గుడేబల్లూరులోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, మక్తల్ పడమటి ఆంజనేయ స్వామి, మాగనూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలతోపాటు కొలంపల్లి కతాల్‌సాబ్ దర్గాను దర్శించుకున్నారు. సరిహద్దు రైతుల రాకను తెలుసుకుని అంతర్జాతీయ రహదారి పొడవునా ఉన్న గ్రామాల ప్రజలు నీరాజనం పలికారు. మార్గమధ్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు కర్ణాటక రైతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలోని అన్నివర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ నెంబర్‌వన్ స్థానంలో ఉన్నదని పలువురు రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు గతంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గాని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గాని ఒక్కటి కూడా అమలు చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు తిరిగి కేసీఆర్ సీఎం కావాలన్న లక్ష్యంతోనే స్వచ్ఛందంగా ర్యాలీ నిర్వహించి ఇక్కడి ప్రజలను చైతన్యం చేసేందుకు బయలుదేరినట్లు తెలిపారు.



అన్న కేసీఆర్ సీఎం కావాలని వాహనానికి కట్టిన జెండాను చూపెడుతున్న కర్ణాటక రైతు


### కర్ణాటక రైతులపై కాంగ్రెస్ నేతల జులుం

కర్ణాటక రాష్ట్రంలోని దేవసూగూర్ పరిసర గ్రామాల నుంచి తెలంగాణలోకి వస్తున్న రైతులపై మక్తల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు జులుం ప్రదర్శించారు. రైతుల వాహన ర్యాలీకి అడుగడుగునా ఆటంకం సృష్టించారు. కృష్ణ మండలంలోని టైరోడ్డు, మాగనూర్ మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను అడ్డుకుని వారితో వాగ్వాదానికి దిగారు. కర్ణాటకలో కరెంట్ సమస్య ఉన్నది తమకు కూడా తెలుసని.. అక్కడ సమస్య ఉంటే మీరు అక్కడే ఉండి ధర్నాలు చేసుకోండని ఉచిత సలహాలు ఇచ్చారు. మీరు మెడలో గులాబీ కండువాలు వేసుకుని ప్రజలను చైతన్యం చేస్తామంటే ఒప్పుకునేది లేదంటూ వితండవాదం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి జోక్యం చేసుకోవడంతో కర్ణాటక రైతులు తమ వాహన ర్యాలీతో ముందుకు కదిలారు. రాయచూర్ జిల్లాలోని శక్తినగర్ నుంచి ప్రారంభమైన యాత్ర మక్తల్, నారాయణపేట, గద్వాల, కొడంగల్ నియోజకవర్గంలో కొనసాగుతుందని పేర్కొన్నారు. ముందుగా మాగనూరు మండలకేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని మండలకేంద్రానికి చేరుకోగా మాగనూరు కృష్ణ మండలాల బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌గౌడ్ మాగునూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వివిధ మండలా నాయకుల ఆధ్వర్యంలో కర్ణాటక రైతులకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మక్తల్ మండలానికి చేరుకొని మక్తల్ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం నారాయణపేట నియోజకవర్గానికి బైక్ ర్యాలీ ప్రారంభించినట్లు కర్ణాటక రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాగనూరు గ్రామ సర్పంచ్ రాజు, బీఆర్ఎస్ మండల నాయకులు జనంద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మారెప్ప, నేరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి కరెంట్ లేక పంటలు ఎండిపోయాయి. కరెంట్ విషయంలో అధికారులు, ఎమ్మెల్యేలను అడిగినా సమాధానం లేదు. దిక్కుతోచని స్థితిలో రైతులం ఉన్నాం. అదే తెలంగాణలో సీం కేసీఆర్ సారథ్యంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు 24గంటల ఉచిత విద్యుత్‌తోపాటు రైతుబంధు, రైతుబీమా వంటి అనేక పథకాలు అమలు చేశారు.

**- సురేశ్, రైతు, కర్ణాటక**



కర్ణాటకలో అడ్డగోలుగా హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ పార్టీ పథకాలు అమలు చేయడంలో విఫలమైంది. ఒక్క పథకం కూడా సరిగ్గా అమలు కావడంలేదు. రైతుల గోస పట్టించుకునే వారే లేరు. అదే తెలంగాణలో ప్రతి గడపగడపకూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారు.

**- నాగభూషణ్, రైతు కర్ణాటక**